క్లుప్తంగా

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని శిఖం, ప్రభుత్వ భూముల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ జేసీబీలతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ, శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్పోర్ట్స్‌మీట్ ప్రారంభం



టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ ఆర్ఎల్ఆర్ స్కూల్‌లో సోమవారం స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. ఈ నెల 11వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఆటల పోటీలను సోమవారం ఆ స్కూల్ చైర్మన్ డాక్టర్ లక్ష్మారెడ్డి క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. స్పోర్ట్స్ మీట్‌లో మొదటిరోజు టగ్‌ఆఫ్‌వార్, ఖోఖో, 50 మీటర్ల రన్నింగ్ రేస్, స్కిప్పింగ్, లిమన్ స్పూన్ తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు నరేష్, నవీన్, మహేష్, అపర్ణ, అఖిల పాల్గొన్నారు.

డీసీసీబీ ద్వారా మెరుగైన సేవలు

కల్హేర్(నారాయణఖేడ్): డీసీసీబీ ద్వారా రైతులు, ఖాతాదారులకు ఉత్తమ సేవలను అందిస్తున్నామని సిర్గాపూర్ డీసీసీబీ మేనేజర్ రవీందర్ తెలిపారు. ఈ మేరకు బ్యాంక్ ఉద్యోగులతో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ రవీందర్ మాట్లాడుతూ ఇటీవల నూతనంగా ప్రారంభించిన డీసీసీ బ్యాంక్ ద్వారా వ్యవసాయ రుణాలు, దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు, ఎస్‌హెచ్‌జీ, పీఎంఈజీవై, విద్య, గృహవసరాలు, వాహనం, గోల్డ్ లోన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. బ్యాంక్‌లో తీసుకున్న అప్పులు సకాలంలో చెల్లిస్తే వడ్డీ భారం తగ్గుతుందని సూచించారు. రైతులు, ఖాతాదారులు బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుపాయలకు పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

వట్‌పల్లి(అందోల్): ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా దామోదర రాజనర్సింహ గెలుపొందడంతో మండల పరిధిలోని పోసానిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఏడుపాయల దుర్గాభవానీమాత ఆలయానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ మండల నాయకుడు, న్యాయవాది మధుసూధన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఎండీ అనీఫొద్దిన్, నాయకులు శివచందర్, వెంకటేశం, గోపాల్, జనార్దన్, ఎల్లయ్య, రఘుపతి తదితరులు పాదయాత్రగా వెళ్లినవారిలో ఉన్నారు.

రేపు 'ఉపాధిహామీ'పై సోషల్ ఆడిట్

నారాయణఖేడ్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా నారాయణఖేడ్ మండలంలో చేపట్టిన పనులపై 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను ఈ నెల 10వ తేదీన ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1ఏప్రిల్ 2022 నుంచి 31మార్చి 2023 వరకు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం డిసెంబర్ 18 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు తనిఖీ నిర్వహించారన్నారు. తుది నివేదిక సమర్పించేందుకు సామాజిక తనిఖీ ప్రజావేదికను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వట్‌పల్లి(అందోల్): జీవితంపై విరక్తి చెంది ఫినాయిల్ తాగిన మహిళ సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఖాదిరాబాద్ గ్రామానికి చెందిన చేవేళ్ల మల్లమ్మ కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతోంది. మరోవైపు భర్త లేడనే బెంగ ఆమెను కుదిపివేయడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫినాయిల్ తాగింది. దీంతో గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్రయాణం.. నరకప్రాయం

- రూ.5.10కోట్లతో రోడ్డు పనులు ప్రారంభం
- నాలుగేళ్లు గడుస్తున్నా పూర్తికాని వైనం
- ఇబ్బందుల్లో బాబానగర్ ప్రాంత ప్రజలు

దూరభారం తగ్గడం.. అంతర్ జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని కోట్ల రూపాయలతో చేపట్టిన రోడ్డు పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అధికారులు, కాంట్రాక్టు మధ్య సమన్వయ లోపం ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పనులు పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– జహీరాబాద్ టౌన్



అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు

జహీరాబాద్ మండల పరిధిలోని రంజోల్ నుంచి బాబానగర్ మీదుగా హుగ్గెల్లి తండా, పిచేరాగడి గ్రామాల ప్రజల రాకపోకల కోసం బీటీ రోడ్డును అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ రోడ్డు పనులు పూర్తయితే జహీరాబాద్–కోహీర్ మండలాల్లో నాలుగు గ్రామాలతో పాటు పక్కనున్న వికారాబాద్ జిల్లాలోని మర్పల్లి, తాండూరు ఉపయోగంగా ఉంటుందని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో నాటి ప్రభుత్వం రూ.5.10కోట్లను మంజూరు చేయగా 2019లో ఎమ్మెల్యే మాణిక్‌రావు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత రోడ్డు పనులను పట్టించుకునేనాథుడు కరువయ్యాడు.

కంకర పరిచారు.. వదిలేశారు...

పనులను దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ రంజోల్ పాలిటెక్నిక్ కళాశాల నుంచి బాబానగర్, హుగ్గెల్లితండా, పిచరాగడి వరకు కంకర, మొరం పనులను చేపట్టారు. పలు చోట్ల కల్వర్టు పనులు కూడా ప్రారంభించారు. ఆ తరువాత ఎమైందో తెలియదు కానీ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇప్పటికీ నాలుగేళ్లు దాటుతున్నా నేటికీ పనులు పూర్తి కాలేదు. రోడ్డుపై కంకర పోసి వదిలేయడం ద్వారా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.



పంచాయతీరాజ్ ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న బాబానగర్ ప్రజలు

ఎన్నికలు బహిష్కరిస్తామంటే స్పందించిన అధికారులు

రోడ్డు పనులు పూర్తి చేయకుంటే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని బాబానగర్ ప్రజలు హెచ్చరించారు. 20 రోజుల పాటు నిరసనలు చేపట్టడంతో స్పందంచిన అధికారులు బాబానగర్ ప్రాంత ప్రజలతో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించారు. ఆ తర్వాత ఎన్నికలు ముగిసిన వెంటనే మళ్లీ పనులు ఆపేశారు. దీంతో బాబానగర్ ప్రజలు పంచాయతీరాజ్ ఈఈ జగదీశ్వర్‌ను ఇటీవల కలిసి వినతిపత్రం కూడా అందజేశారు. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రావడం లేదని వారు వాపోతున్నారు.

పనులు పూర్తి చేయిస్తాం

అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభిస్తాం. వర్షాలు తదితర కారణంగా పనులకు ఆటకం కలిగింది. కంకర పనులు పూర్తయ్యాయి. సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే రోడ్డు పనులు ప్రారంభిస్తాం. వేగవంతంగా పనులు పూర్తిచేసి ప్రయాణికులకు మెరుగైన రవణా సౌకర్యం కల్పిస్తాం.

– కోటేశ్వర్‌రావు, పంచాయతీరాజ్, ఏఈ

ఆందోళనకు దిగుతాం



అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రోడ్డు కోసం రూ.5.10కోట్లను మంజూరు చేసింది. కాంట్రాక్టర్‌కు రూ.3 కోట్ల వరకు ప్రభుత్వం బిల్లులను చెల్లించింది. అయినా పనులు ఆగిపోయాయి. దీంతో ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందజేశాం. అయినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా స్పందించకపోతే ఆందోళనకు దిగుతాం.

– కరణం రవికుమార్, బాబానగర్

అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలను రూపొందిస్తూ నిధులను కేటాయిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డు ఆర్టీసీ కాలనీలో రూ.70లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, రూ.40లక్షలతో నిర్మించనున్న యూజీడీ నిర్మాణ పనులను కౌన్సిలర్ మహదేవరెడ్డితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నరసింహగౌడ్,



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

కోఆప్షన్ సభ్యులు రాములు, వీఫర్‌యూ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, కార్యకర్తలు, కాలనీ పెద్దలు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి అర్హత పరీక్ష

మునిపల్లి(అందోల్): మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–2025 విద్యా సంవత్సరంలో తెలంగాణ మోడల్ స్కూల్‌లో 7వ తరగతి నుంచి 10వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్ష ఆల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. అదేవిధంగా 7, 10వ తరగతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఓసీ విద్యార్థులకు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.125 ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

11న ముగ్గుల పోటీలు

జహీరాబాద్ టౌన్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఈ నెల 11వ తేదీన ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అస్లాంఫారూఖీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి కింద రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5వేలు అందజేయనున్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనేవారికి రంగులు ట్రస్ట్ నిర్వాహకులే అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థినులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారానికి చెందిన సుమిత్రాదేవి కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి సుమిత్రాదేవికి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. దీంతో అనిల్‌కుమార్‌రెడ్డికి సుమిత్రాదేవి కృతజ్ఞతలు తెలిపారు.

పనిఒత్తిడి నుంచి ఉల్లాసం వైపు..

- ఒకేచోటకు కార్మికులు, ఉద్యోగులు, అధికారులు
- వనభోజనాలకు ఆర్టీసీ సంస్థ శ్రీకారం
- రేపటిలోపు కార్యక్రమాలను పూర్తి చేసుకునేందుకు అవకాశం



నారాయణఖేడ్ డిపో ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు(ఫైల్)

నారాయణఖేడ్: ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది విధి నిర్వహణలో బీజీగా ఉంటూ పని ఒత్తిడితో ఉంటారు. దీంతో ఉద్యోగులందరినీ ఒకచోటకు చేర్చి వారిలో ఉల్లాసం నింపేందుకు టీఎస్ ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా వన భోజనాలకు శ్రీకారం చుట్టింది. అధికారులు సిబ్బందితో కలిసి భోజనాలు చేయడం, ఉద్యోగుల సాధక బాధకాలు పంచుకోవడం, ఆటాపాటలతో గడపడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్మికులు, ఉద్యోగులు, అధికారులు వేర్వేరుకాదనే సంకేతాన్ని కార్యక్రమం ద్వారా చాటనున్నారు. ఇతర ఉద్యోగుల్లా కాకుండా ఆర్టీసీ ఉద్యోగుల విధి నిర్వహణకు ఖచ్చితమైన సమయం అంటూ ఉండదు. కొందరు తెల్లవారకముందే డ్యూటీకి వెళ్లేవారు ఉండగా.. మరికొందరు రాత్రి సమయాల్లోనూ ఎలాంటి ఆలసటకు గురికాకుండా విధులు నిర్వర్తించేందుకు సిద్ధమవుతుంటారు. కొన్ని రూట్లలో సర్వీస్ క్యాన్సిల్ కాకుండా ఉండాలని అధికారులు ఆదేశిస్తే తాను డ్యూటీ పూర్తిచేసి వచ్చినా తిరిగి డబుల్ డ్యూటీ (డీఆఫ్)కు వెళ్లాల్సిందే. కొన్ని సందర్భాల్లో వారం పూర్తిగా డ్యూటీ పూర్తిచేసి ఆఫ్ తీసుకోవాల్సిన సందర్భాలు ఉంటాయి. ఒక డిపోలో 500లోపు సిబ్బంది ఉంటే రూ.75వేలు, అంతకుమించి ఉంటే రూ.లక్ష వరకు ఖర్చు చేసుకునేందుకు ఈ నెల 10వ తేదీలోపు కార్యక్రమాలను పూర్తి చేసుకునేందుకు ఆర్టీసీ సంస్థ అవకాశం కల్పించింది.

ఏర్పాట్లలో అధికారులు, ఉద్యోగులు..

ఉమ్మడి జిల్లాలో 8 డిపోలు ఉండగా 2,355 మంది కార్మికులు, ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికే మెదక్, సిద్దిపేట, దుబ్బాక, నర్సాపూర్ డిపోల్లో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, సంగారెడ్డి, జహీరాబాద్, సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోల్లో వనభోజనాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2020 జనవరి 8న వనభోజనాలకు అప్పట్లో వెళ్లారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వనభోజన కార్యక్రమాలకు ప్రారంభించడంతో పాటు నిధులను కేటాయించాలని నిర్ణయించింది.

కుటుంబ సభ్యులమనే భావన



వనభోజనాల కార్యక్రమంతో కార్మికుల్లో ఉల్లాసం, ఉత్సాహాన్ని నింపడం ప్రధాన ఉద్దేశ్యం. అధికారులు, సిబ్బంది, కార్మికులు కలిసి అందరం వన భోజనాల్లో పాల్గొంటాం. అందరం ఒక కుటుంబ సభ్యులం అనే భావన కలగిస్తోంది.

– పాండు, ఆర్టీసీ కార్మికుడు, నారాయణఖేడ్

నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం



నారాయణఖేడ్ డిపోలో కూడా వనభోజనాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ నెల 9వ తేదీన కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. అధికారులు, కార్మికులు, ఉద్యోగులు అందరినీ ఒకచోట చేర్చి కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.

– మల్లేశయ్య, డీఎం, నారాయణఖేడ్

ఆదేశాలు వచ్చాయి



ఉమ్మడి జిల్లా రీజియన్ పరిధిలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో వనభోజనాలను నిర్వహిస్తాం. కార్మికులు, ఉద్యోగులు, అధికారులు అందరూ ఒకచోట చేరి కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమ నిర్వహణ గురించి ఆర్టీసీ సంస్థ నుంచి ఆదేశాలు వచ్చాయి.

– ప్రభులత, రీజినల్ మేనేజర్, సంగారెడ్డి

కలెక్టర్ క్రాంతికి శుభాకాంక్షలు

మునిపల్లి(అందోల్): సంగారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వల్లూరి క్రాంతికి జెడ్పీటీసీ మీనాక్షి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయికుమార్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

జహీరాబాద్ టౌన్: కలెక్టర్ క్రాంతిని డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ శివకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లాలో వరి సేకరణ సంబంధించిన కమీషన్‌ను విడుదల చేయాలని డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ కలెక్టర్ క్రాంతికి వినతిపత్రం అందజేశారు. కరోనా మహమ్మారి సమయంలో అన్ని కేంద్రాల సిబ్బంది వరి సేకరణలో కష్టపడి వరి సీజన్‌లను విజయవంతంగా పూర్తిచేశారని గుర్తుచేశారు. కానీ.. వారికి నేటికీ కమిషన్ రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్‌కు వివరించారు.



కలెక్టర్ క్రాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీటీసీ మీనాక్షి, నాయకులు



కలెక్టర్ క్రాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

పెన్షనర్లకు అండగా ఉంటాం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని సోమవారం వార్డు కార్యాలయంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సర్వీసు కాలంలో ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించారని గుర్తు చేశారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధురెడ్డి, పుష్ప, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సర్కిల్ అధ్యక్షుడు పరమేష్‌యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సత్యనారాయణ, ఐలేష్‌యాదవ్, ప్రమోద్‌గౌడ్, నాయకులు దేవేందర్‌చారి పాల్గొన్నారు.

పటాన్‌చెరు: రూ.1200 కోట్ల అంచనా వ్యయంతో మదీనాగూడ నుంచి లింగంపల్లి పటాన్‌చెరు మీదుగా సంగారెడ్డి వరకు త్వరలో చేపట్టనున్న జాతీయ రహదారి విస్తరణ పనులను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట జాతీయ రహదారుల సంస్థ ఈఈ ధర్మారెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ కుమార్‌యాదవ్, ముత్తంగి గ్రామ సర్పంచ్ ఉపేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

శ్రీరాముడి అక్షింతల పంపిణీ



న్యాల్‌కల్‌లో శ్రీరాముడి అక్షింతలతో గ్రామపెద్దలు



వట్‌పల్లి: హనుమాన్ ఆలయంలో...



పటాన్‌చెరు టౌన్: అక్షింతల ఊరేగింపులో...

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని రామలింగేశ్వర ఆలయ అర్చకులు మహేష్ ఆధ్వర్యంలో సోమవారం పురవీధుల మీదుగా అయోధ్య రాముడి పూజిత అక్షింతల ఊరేగింపును నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి పూజిత అక్షింతలను పంపిణీ చేశారు.

న్యాల్‌కల్ మండల కేంద్రంలో...

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రంలో అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి అక్షింతలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సతీష్ కుమార్, రాంచందర్ పవార్, మెడికల్ అశోక్, నర్సింహారెడ్డి, బసంతి, శివరాజ్, శ్రీశైలం, ప్రభారెడ్డి, సుబ్బన్న, మహేష్‌కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంగుపేటలో...

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని సంగుపేట గ్రామంలో అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామపెద్దలు రామచంద్రారెడ్డి, మల్లారెడ్డి, శివశంకర్‌గౌడ్, రవీందర్‌గౌడ్, లక్ష్మణ్‌రావు, రాములు, నరేందర్‌గౌడ్, అంజయ్య, సురేష్‌గౌడ్, రాఘవేందర్, శంకర్‌గౌడ్, కృష్ణ, ఆదిత్య, భజరంగ్‌దళ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నర్సాపూర్ అభివృద్ధికి కృషి

నర్సాపూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానని ఇన్‌చార్జి చైర్మన్ నయిమొద్దీన్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. కౌన్సిలర్లందరిని కలుపుకొని పోయి పట్టణ అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. కాగా మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఆ రాజీనామాను కలెక్టర్ రాజర్షిషా అమోదించారని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ చెప్పారు. నిబంధనల మేరకు ఇన్‌చార్జ్ చైర్మన్‌గా వైస్‌చైర్మన్ నయిమొద్దీన్‌కు బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

పలువురు నాయకుల శుభాకాంక్షలు

నర్సాపూర్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా నయిమొద్దీన్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను కమిషనర్ వెంకటగోపాల్, నాయకులు, కౌన్సిలర్లు పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పలువురు బీఆర్ఎస్ నాయకులు గోపి, శేఖర్, సత్యంగౌడ్, బాల్‌రెడ్డి, మహ్మద్, భిక్షపతి, షేక్ హుస్సేన్, ప్రసాద్, రాకేశ్‌గౌడ్, దావూద్, నగేశ్, ఆంజనేయులుగౌడ్, సాగర్, మున్సిపల్ మాజీ చైర్మన్ మురళీయాదవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



నయిమొద్దీన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్, నాయకులు